

అటవీ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, పక్కన మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి తదితరులు

మొసలిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలి

● అటవీ శాఖాధికారులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచన

చాదర్‌ఘాట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): చైతన్యపురి డివిజన్‌లోని ఫణిగిరి కాలనీని అనుకుని ఉన్న మూసీలో మొసలి సంచరిస్తున్న విషయం తెలుసుకుని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం అటవీ శాఖాధికారులతో కలిసి సందర్శించారు. మూసీలో, మూసీ పరీవాహక ప్రాంతంలో సంచరిస్తున్న మొసలిని కట్టడి చేసేందుకు అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఈసందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు. రెండు, మూడు రోజుల క్రితం ఫణిగిరి కాలనీలోని శివాలయం వద్ద మూసీలో సంచరిస్తున్న మొసలి నాలుగు కుక్కలను ఈడ్చుకెళ్లిన సంఘటన స్థానిక కాలనీవాసులను తీవ్ర భయాందోళనకు గురిచేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫణిగిరి కాలనీ పరిసర కాలనీల కుటుంబీకులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అటవీ శాఖ అధికారి శరత్‌చంద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు కృష్ణారెడ్డి, అజయ్, ప్రభు, శ్రీనివాస్, రామకృష్ణ, గణేష్ పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సీఎం సహాయనిధితో పేదలకు ఎంతో మేలు

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

హయత్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం పొంది సదరు బిల్లులు ప్రభుత్వానికి దరఖాస్తు చేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కరాచారి, కాంగ్రెస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ, నాయకులు మస్కు నర్సింహ, ధనరాజ్‌గౌడ్, సికిందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఫుట్‌పాత్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

రాజకీయాలకతీతంగా ఐఎస్‌సదన్ అభివృద్ధి

సైదాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు, ప్రాంతాలకు అతీతంగా ఐఎస్‌సదన్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి తెలిపారు. గురువారం సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో ఫుట్‌పాత్, రోడ్డు నెంబరు-14లో అంబేడ్కర్ విగ్రహం ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. అందరి సహకారంతో డివిజన్‌ను గ్రేటర్‌లోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, నేతలు మన్నె శ్రీనివాస్, బొమ్మల ప్రశాంత్, కాలనీ ప్రతినిధులు సీఎస్‌రెడ్డి, సర్వేశ్వర్‌రావు, వెంకటరమణ, శైలజ, ఆనంద్ పాల్గొన్నారు.



బీఎన్‌రెడ్డినగర్‌లో మొక్కలను నాటుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన గాలి, నీరు, ఆహారం పొందాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పెంచి పోషించాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం బీఎన్‌రెడ్డినగర్‌లో కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని పౌరులందరు పర్యావరణ పరిరక్షణకు తమ విధిగా మొక్కలు నాటి పెంచాలన్నారు. కార్యక్రమంలో దేవిపోచమ్మ ఆలయ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి బియ్యం, కందిపప్పు విరాళం

చంపాపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): సాగర్‌రోడ్డులోని హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని నాగార్జున మాంటిస్సోరి, ఐఐటీ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు గురువారం కీర్తన అనాథ ఆశ్రమానికి ఎనిమిది క్వింటాళ్ల బియ్యం, 50కిలోల కందిపప్పును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏడాది పాఠశాలలో చారిటీ డే నిర్వహించి విద్యార్థుల నుంచి సేకరించిన సరుకులకు తోడుగా యాజమాన్యం మరికొంత కలిపి ఆశ్రమానికి విరాళంగా అందజేసినట్లు పేర్కొన్నారు. సమాజంలోని అభాగ్యుల పట్ల ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్మన్ జి.రజిని విఠల్‌రెడ్డి, సీఈఓ. శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్.రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.పద్మావతి, ఇన్‌చార్జీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా కోర్టులో ఉచిత వైద్య శిబిరం

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లా కోర్టు కాన్ఫరెన్స్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి భవానీ ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో దాదాపు 200 మంది న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి కార్తీక్ బొసెట్టి, జక్కుల వెంకట్, మహిళా ప్రతినిధి అనసూయ, నర్సింహారెడ్డి, సత్యనారాయణరెడ్డిలతో పాటు పలువురు న్యాయవాదులు, కామినేని ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి భవానీ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, కార్తీక్

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● తహసీల్దార్‌కు ఉద్యమకారుల ఫోరం వినతి

ఎల్‌బీనగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సరూర్‌నగర్ తహసీల్దార్‌కు ఫోరం నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, రూ.2500 పింఛను ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినప్పటికీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఆయన తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ల రామ్‌నరసింహగౌడ్, బలరాం, జోర్క రాము ముదిరాజ్, రాజు నాయక్ పాల్గొన్నారు.



హయత్‌నగర్ నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీయూఎఫ్ నేతలు

హయత్‌నగర్ నాయబ్ తహసీల్దార్‌కు వినతి

హయత్‌నగర్ : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నిలబెట్టుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమకారుల ఫోరం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ హయత్‌నగర్ నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ తెలంగాణ ఉద్యమ కారులకు అనేక హామీలను ఇచ్చిందన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు వనుపరి బలరాం, ఎర్ర రవీందర్, రాజునాయక్, వరలక్ష్మి, నీరజ, టీయూఎఫ్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ అధ్యక్షుడు జోర్క రాముముదిరాజ్, చిత్రం కృష్ణ పాల్గొన్నారు.



సరూర్‌నగర్ తహసీల్దార్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు

బందోబస్తును పరిశీలించిన రాచకొండ సీపీ

ఉప్పల్ : ఉప్పల్‌లో మహాకాళి, ఈదమ్మ బోనాల ఉత్సవాలతో పాటు, పలహారం బండ్ల ఊరేగింపును పురస్కరించుకొని ఉప్పల్ పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు స్వయంగా ఉప్పల్ చేరుకొని బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. సాయంత్రం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న సీపీ సుధీర్‌బాబు పోలీస్‌స్టేషన్‌లో సర్వేలెన్స్ సీసీ కెమెరాలను పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై ఏసీపీ చక్రపాణి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్‌రావులకు పలు సూచనలు చేశారు. మహాకాళి ఆలయం వద్ద పలహారం బండ్ల ఊరేగింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులకు సూచించారు.

నేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మీశ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం ఉంటుందని ఈ సమావేశంలో మార్కెట్‌లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశానికి ముందు మార్కెట్‌లో మిర్చియార్డ్ వద్ద నూతనంగా బీఓటీ పద్ధతిలో నిర్మించే సులబ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. పాలక మండలి సభ్యులందరు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

ఎన్‌జీవోస్ కాలనీ టూ కేపీహెచ్‌బీ కాలనీకి మెట్రో డీలక్స్ బస్సు

హయత్‌నగర్ : హయత్‌నగర్-2 బస్సు డిపోకు చెందిన కొత్త బస్సును ఆగస్టు-1 నుంచి వనస్థలిపురం ఎన్‌జీఓ కాలనీ నుంచి కేపీహెచ్‌బీకాలనీ వరకు నడిపించడం జరుగుతుందని హయత్‌నగర్-2 డిపో మేనేజర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు ఎన్‌జీఓకాలనీ, వయా పనామా మీదుగా ఎల్బీనగర్, నాగోల్, ఉప్పల్, హబ్సీగూడ, తార్నాక చిలుకలగూడ, సికింద్రాబాద్ స్టేషన్, బోయిన్‌పల్లి, బాలానగర్ ద్వారా కేపీహెచ్‌బీ కాలనీకి చేరుకుంటుందని తెలిపారు. ప్రతి 25 నిముషాలకు ఒక బస్సు ఈ రూట్‌లో నడిపించడం జరుగుతుందని డీఎం తెలిపారు.



నిజాయితీ చాటుకున్న ప్యూర్‌లో నాచురల్ సిబ్బందిని అభినందిస్తున్న యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఉపేందర్‌రెడ్డి

నిజాయితీ చాటుకున్న ప్యూర్‌రో నాచురల్ సిబ్బంది

ఎల్‌బీనగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురం డివిజన్ వాసవీకాలనీలోని ప్యూర్‌రో నాచురల్ సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనడానికి వచ్చిన ఓ వినియోగదారుడి బంగారం ఉంగరం పడిపోయింది. ఆ ఉంగరం అక్కడ పనిచేసే సిబ్బంది నందినికి దొరికింది. ఆమె విషయాన్ని సంస్థ యాజమాన్యానికి చెప్పి బంగారు ఉంగరం అందజేసింది. కొద్దిసేపటికి వినియోగదారులు అక్కడికి వచ్చి లక్ష రూపాయలు విలువ గల తన బంగారు ఉంగరం పడిపోయిందని అడిగాడు. దీంతో సూపర్‌మార్కెట్ యాజమాన్యం అతనికి బంగారు ఉంగరం అందజేసింది. తన బంగారు ఉంగరాన్ని నిజాయితీగా ఇచ్చిన నందినికి అతను కృతజ్ఞతలు తెలియజేశాడు. విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించి దొరికిన బంగారు ఉంగరాన్ని ఇచ్చిన నందినిని సంస్థ యాజమాన్యం అభినందించి రూ. 5వేలు ప్రోత్సాహక బహుమతి అందజేసింది. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి అక్కడికి వచ్చి నందినిని అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ప్యూర్‌రో నాచురల్ యాజమాన్యం మోహన్, అశోక్, మేనేజర్ నవీన్, నవీన్‌కుమార్, వినయ్ పాల్గొన్నారు.

రాధాకృష్ణ.. ఉపాధ్యాయులకు ఆదర్శం

● ఉద్యోగ విరమణ వీడ్కోలులో డీఈవో రోహిణి

చాదర్‌ఘాట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ముప్పై తొమ్మిదిన్నర ఏళ్లపాటు విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన తిరునగరి రాధాకృష్ణ ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శమని హైదరాబాద్ డీఈవో రోహిణి కొనియాడారు. సైదాబాద్ డిప్యూటీ ఈవోగా, మూసారాంబాగ్ సంజీవయ్యనగర్ బస్తీలోని బాగ్ మూసారిమో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా తిరునగరి రాధాకృష్ణ ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి మండలం డిప్యూటీ ఈవో వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు రామ్మోహన్, శశికళతో పాటు పలువురు పాల్గొన్నారు. అంతకుముందు పీఆర్టీయూ టీఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టి.తిరుపతిరెడ్డి సైదాబాద్ మండల శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేసిన రాధాకృష్ణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ సైదాబాద్ మండల అధ్యక్షుడు జి.ఆంజనేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మందడి వెంకట్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, సతీష్, శ్రీవాణి, జ్యోతి, శ్రీదేవి, నిర్మల, సునీత పాల్గొన్నారు.



రాధాకృష్ణకు వీడ్కోలు పలుకుతున్న డీఈవో రోహిణి, డిప్యూటీ ఈవో వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు శశికళ, రామ్మోహన్

మహాధర్నాను విజయవంతం చేద్దాం

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆగస్టు 2వ తేదీన నగరంలో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు రంగ జంగమయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శి అంజయ్య కోరారు. గురువారం అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీల్లో భాగంగా బీసీలకు 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించి ఇప్పుడు చేతగాక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తోసివృచ్ఛడం సిగ్గుచేటన్నారు. రిజర్వేషన్ల అమలు విషయంలో కాంగ్రెస్ కుంటి సాకులతో బీజేపీని బద్నాం చేసే పనులు చేపడుతుందన్నారు. రిజర్వేషన్ల అమలుపై ఆగస్టు 2న ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాకు జిల్లా నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి పాపయ్యగౌడ్, బొడిగె రమాదేవి, సాయికుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కష్టపడి చదవాలి

సైదాబాద్ : విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడి చదవాలని మలక్‌పేట ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. గురువారం హెచ్‌ఎం విజయలక్ష్మి ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా మలక్‌పేట పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. తాను ఉద్యోగ విరమణ చేసినప్పటికీ విద్యార్థులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

సైదాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణికుల దృష్టి మరల్చి చోరీలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను సైదాబాద్ పోలీసులు అరెస్టు చేసి 14గ్రాముల బంగారు గొలుసు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. డీఐ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. యాంజాల్ బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్డుకు చెందిన తంగిరాల మోహన్‌రెడ్డి అనే రైతు ఈనెల 10న మధ్యాహ్నం ఐఎస్ సదన్ చౌరస్తాలో ఇంటికి వెళ్లేందుకు షేరింగ్ ఆటో ఎక్కాడు. అప్పటికే ఆటోలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు మోహన్‌రెడ్డిని ఇబ్బందులకు గురిచేస్తుండడంతో ఆటో డ్రైవర్‌ని ఆటో ఆపమని చెప్పాడు. చంపాపేట సునీతా ఆస్పత్రి వద్ద ఆటో ఆపివేయడంతో దిగాడు. వెంటనే మెడలో ఉన్న 17 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడ్డ ముఠా సభ్యులలో కంచన్‌బాగ్ హఫీజ్ బాబానగర్‌కు చెందిన మహ్మద్ ఖాలేద్(26), ఫిరోజ్ అలీఖాన్(30)లను అరెస్ట్ చేసి 14గ్రాముల బంగారు గొలుసు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై గతంలో సైదాబాద్, పహాడీషరీఫ్, అత్తాపూర్ పీఎస్‌లలో కేసులు నమోదై ఉన్నట్లు డీఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చంపాపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): మిధానీ డిపో సమీపంలో గురువారం గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫిసల్‌బండ మిధానీ ఆర్టీసీ బస్ డిపో సమీపంలో గుర్తు తెలియని యువకుడి(35) మృతదేహం పడివుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పాయింట్, షర్ట్ ధరించిన అతని జేబులో ఎల్బీనగర్ నుంచి ఫిసల్‌బండ వరకు బుధవారం రాత్రి ప్రయాణించినట్లు బస్ టికెట్‌ను కనుగొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.

సబ్‌రోడ్డు అభివృద్ధికి రూ.80లక్షలు మంజూరు

మన్సూరాబాద్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ చౌరస్తా నుంచి ఎల్‌పీటీ మార్కెట్ వరకు విజయవాడ జాతీయ రహదారి మార్గంలో సబ్‌రోడ్డు అభివృద్ధి పనులకు రూ.80లక్షలు మంజూరయ్యాయని, ఆ పనులను త్వరలోనే ప్రారంభించుకోనున్నట్లు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. సిందూర్ ఎన్‌క్లేవ్ హైరైజ్ అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్‌తో కలిసి ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం ఆ ప్రాంతంలో పర్యటించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య, వరదనీటి నిల్వ, వాహనాల పార్కింగ్ తదితర సమస్యలను కార్పొరేటర్ జెడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ, సిందూర్ ఎన్‌క్లేవ్ హైరైజ్ అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరాములు, ఉమామహేశ్వర్‌రెడ్డి, విజయసారథి, భాస్కర్‌రెడ్డి, పరమేశ్వర్, శ్రీధర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలను జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వివరిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలి

● టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

కొత్తపేట, జూలై 31(ఆంధ్రజ్యోతి): డ్రైవింగ్ లైసెన్స్ పొంది నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. గురువారం ప్రైవేటు అకాడమీ నుండి ఇంటర్, డిగ్రీ విద్యార్థులు రాచకొండ పిల్లల ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కును సందర్శించారు. పార్కు ఆవరణలో గోడలపై ఏర్పాటు చేసిన సందేశాత్మక నిబంధనల కార్టూన్లను పరిశీలించారు. నిబంధనల ప్రాధాన్యతను అధికారులు వారికి గుర్తుచేశారు. అనంతరం పార్కు లెక్చర్‌హాల్‌లో ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాహన చట్టాలపైన అవగాహన పెంచుకోవాలని సూచించారు.



ట్రాఫిక్ నిబంధనల ప్రాధాన్యతను వివరిస్తున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

13 అవగాహన కార్యక్రమాలు

టీటీఐ అధికారులు పలు ప్రాంతాల్లో 13 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. జిల్లెలగూడలో జడ్పీహెచ్ఎస్‌లో రెండు తరగతుల విద్యార్థులకు, వనస్థలిపురంలో మూడు, మీర్‌పేటలో రెండు ప్రవేటు విద్యా సంస్థల విద్యార్థులకు, ఆటోనగర్, ఎన్‌జీఓస్ కాలనీ బస్‌స్టాండ్‌లలో సాధారణ ప్రజలకు మొత్తం 369 మంది సాధారణ ప్రజలు, విద్యార్థులకు నిబంధనలను పరిచయం చేశారు. బస్ స్టాండు, విద్యాలయాల్లో టీటీఐ ఎస్ఐ నర్సింహారావు, ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్, ఏఎస్ఐ సోమ్‌నాథ్ అవగాహన కల్పించారు.

భారత్ జోడో యాత్ర స్ఫూర్తితో జనహిత పాదయాత్ర

● పీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర స్ఫూర్తితో తెలంగాణలో పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పరిగి నుంచి జనహిత పాదయాత్ర చేపట్టారని పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి చెప్పారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున పరిగికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఆయన పుష్పగుచ్ఛం ఇచ్చి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని మార్కెట్ కమిటీ చైర్మన్లు, దేవాలయ కమిటీల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాదయాత్రలో పీసీసీ ప్రతినిధి భాస్కర్‌రెడ్డి

హయత్‌నగర్‌లో వీరశైవాగమ గురుకులం ట్రస్టు ఏర్పాటు

హయత్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని మహామ్మాయి రాజరాజేశ్వరీ ఆలయంలో గురువారం ఏర్పాటు చేసిన వీరశైవాగమ గురుకులం ట్రస్టును హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న మహామ్మాయి రాజరాజేశ్వరీ ఆలయంలో ట్రస్టును ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు చక్కగా వేద పఠనం నేర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహామ్మాయి రాజరాజేశ్వరీ ఆలయ చైర్మన్ వైఎం ఆగమయ్య, ట్రస్టు గౌరవ అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య, అధ్యక్షుడు నీలకంఠస్వామి, కార్యదర్శి ఎస్ఎం మహేష్, లింగం శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.



ప్రగతి చక్ర అవార్డులను అందజేస్తున్న డిపో మేనేజర్ సమత

17 మంది కార్మికులకు ప్రగతి చక్ర అవార్డులు

చాదర్‌ఘాట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో పని చేస్తున్న కార్మికుల్లో 17మందికి ప్రగతి చక్ర అవార్డులను డిపో మేనేజర్ సమత గురువారం ప్రదానం చేశారు. మే, జూన్ మాసాల్లో డిపోలో మెరుగైన సేవలందించిన కార్మికులను గుర్తించి ప్రగతి చక్ర అవార్డులతో సత్కరిస్తున్నట్లు ఆమె వివరించారు. ఎక్స్‌ప్రెస్‌లకు ఉత్తమ ఈపీకేకు ముగ్గురు, ఆర్డినరీ ఉత్తమ ఈపీకేకు మరో ముగ్గురిని, ట్రావెల్ యాజ్ యూ లైక్ టికెట్ల అమ్మకాల్లో ప్రతిభ కనబరచిన ఇంకో ముగ్గురికి అవార్డులను ప్రదానం చేసి అభినందించారు.

ఆర్ఎంపీ డాక్టర్లపై కేసులు నమోదు

హయత్‌నగర్, జూలై 31(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కుంట్లూర్ రోడ్డులో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ అధికారుల బృందం గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. డాక్టర్ అర్హత లేకున్నా కొంత కాలంగా ఎక్కడ పడితే అక్కడ అడ్డగోలుగా క్లినిక్‌లను పెట్టుకుని ఇష్టానుసారంగా వైద్యం చేస్తున్నట్టు ఫిర్యాదులు అందుకున్న కౌన్సిల్ అధికారులు దాడులు నిర్వహించారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ దండెం లాలయ్యకుమార్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. తనిఖీల్లో డాక్టర్లుగా చెలామణి అవుతూ ప్రజలకు అల్లోపతి వైద్యం చేస్తున్నారని, మెడికల్ షాపులను ఏర్పాటు చేసుకుంటున్నారని, సెలూన్‌లను ఎక్కిస్తున్నారని, పెద్ద సంఖ్యలో బెడ్‌లను ఏర్పాటు చేస్తున్నారని, ఇంజక్షన్ చేస్తున్నారనే విషయాన్ని వారు గుర్తించినట్టు తెలిసింది. ఈ సందర్భంగా విజయనగర్ కాలనీలో బాలాజీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు కొంపల్లి రాంబాబు, కుంట్లూర్ రోడ్డులోని శ్రీవిజయ బ్రహ్మేంద్ర ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు విశ్వనాధుల రామాచారి, కుంట్లూర్ రోడ్డులోని సాయి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు వనం వినోద్‌కుమార్‌లపైన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ దండెం లాలయ్యకుమార్ హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.